క్లుప్తంగా

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



ఉద్యోగులతో చర్చిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: మండలంలోని బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, ఇందుకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ జ్యోతి, ఆదామ్‌బాషాలతో కలిసి ఆయన డ్రాపౌట్ విద్యార్థులపై సర్వే, పాఠశాలలో నమోదు అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సంక్షేమ సహాయకులతో సమీక్షించారు. మండలంలో 187 మంది డ్రాపౌట్ విద్యార్థులుగా ఉన్నారని, వారి ఇళ్లకు వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



బ్యాతోలిలో ఉపాధ్యాయుడు వెంకటస్వామిని సన్మానిస్తున్న హెచ్ఎంలు

సి.బెళగల్: మండలంలోని బ్యాతోలి పాఠశాల ఎస్టీటీ వెంకటస్వామి ఎస్ఏగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను శనివారం పాఠశాలలో హెచ్ఎం సోమశేఖర్, గ్రామపెద్దలు సత్కరించారు. టీచర్‌గా వెంకటస్వామి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పోలకల్, సి.బెళగల్, కంబదహాల్ తదితర గ్రామాలకు చెందిన హెచ్ఎంలు రేవుల శ్రీనివాసులు, కిషోర్‌కుమార్, మునిస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



చిందుకూరు సచివాలయం వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జబీన్

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రజలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందుతున్నాయని వైద్యాధికారిణి మొల్లా జబీన్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిందుకూరు సచివాలయం పరిధిలోని ప్రజలకు, స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో నెలకు రెండురోజుల పాటు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



గడివేముల కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గడివేముల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల ఆరోగ్యంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించినట్లు గడివేముల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ తేజస్విని అన్నారు. శనివారం మండల కేంద్రం గడివేములలోని కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఓ రుబీనా, ఎంపీహెచ్ఈఓ మనోహర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వరుణుడు కరుణించె.. పంటలకు జీవం పోసె



కోడుమూరులో పచ్చదనం సంతరించుకున్న పంటలు

కోడుమూరు రూరల్: రెండు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి. మండలంలో ఖరీఫ్ సీజన్ కింద పలువురు రైతులు పత్తి, కొర్ర, వేరుశనగ, కంది, పొద్దుతిరుగుడు తదితర పంటలను సాగు చేశారు. నెల రోజుల నుంచి సరైన వానలు లేకపోవడంతో పైర్లు వాడిపోతున్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు ఆయా పంటలు పచ్చదనం సంతరించుకున్నాయి. కాగా మండలంలోని వెంకటగిరి, గోరంట్ల, ప్యాలకుర్తి, వర్కూరు, అమడగుంట్ల, ముడుమలగుర్తి, కోడుమూరులలో వర్షాధారం కింద రైతులు ఉల్లి, ఇతర పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఉద్యానానికి ఉపాధి ఊతం



ఉపాధి హామీ పథకం కింద సాగైన చీనీ తోట

ఎకరా పండ్లతోటల సాగుకు ప్రభుత్వమందించే ప్రోత్సాహకాలు

మొక్కల రకం	1వ ఏడాది ఖర్చు	2వ ఏడాది ఖర్చు	3వ ఏడాది ఖర్చు	మూడేళ్లలో ఎకరాకు ఖర్చు
మామిడి	45.221	29.986	27.986	1.03.193
చీనీ	55.693	25.380	23.380	1.07.459
నిమ్మ	51.559	45.978	43.978	1.41.515
జామ	37.495	45.987	43.778	1.27.460
తైవాన్ జామ	1.06.343	60.210	60.210	2.26.783
సపోట	40.634	25.988	23.988	90.610
దానిమ్మ	1.00.563	73.128	71.128	2.44.819
నేరేడు	30.438	19.013	17.013	66.464

- పంట ధరల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- ఉత్సాహంతో ముందుకొస్తున్న రైతులు
- ఈ ఏడాది 5,304 మంది రైతులకు అర్హత
- 15,975 ఎకరాల్లో రైతులు పండ్లతోటల సాగుకు ఆసక్తి

కోడుమూరు: మెట్ట భూముల్లో పండ్లతోటలు సాగుకు సన్నకారు రైతులకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది. మామిడి, చీనీ, దానిమ్మ, జామ, తైవాన్ జామ, కొబ్బరి, మల్లె, గులాబీ, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ, కరివేపాకు తదితర ఉద్యాన పంటల సాగుకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోంది. మొక్కల పంపిణీని మొదలుకొని గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం, మొక్కల సంరక్షణకు రోజు నీటితడిని అందించే కూలీల వేతనాలు సైతం ప్రభుత్వమే భరిస్తోంది. పండ్ల తోటలను సంరక్షించుకోవడంతో పాటు రైతులు తమ పొలాల్లో పనులు చేసుకొని ఉపాధిహామీ పథకం ద్వారా వేతనాలు పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అంతర పంటల సాగు కోసం రూ.1,000, నాగలి సేద్యానికి మరో రూ.1,000 ఇలా మూడేళ్ల పాటు పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరిస్తోంది. రైతులు ఉపాధిహామీ పథకం నిధులను సద్వినియోగం చేసుకొని మూడేళ్లపాటు పండ్లతోటలను కాపాడుకుంటే 30, 40 ఏళ్లపాటు ఎలాంటి ఖర్చు లేకుండా రైతులు ఏటా లాభాలను పొంది రైతులు ఆర్థికంగా ఎదుగేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. కర్నూలు జిల్లాలో ఈ ఏడాది పండ్లతోటల సాగుకు రైతులు ఎంతో ఆసక్తితో ముందుకొస్తున్నారు. ఈ ఏడాది 5,304 మంది రైతులు 15,975 ఎకరాల్లో పండ్లతోటల సాగు చేసుకునేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.




వర్కూరు సమీపంలో రైతు పొలంలో పండ్ల మొక్క నాటుతున్న అధికారులు

సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం



అతివృష్టి, అనావృష్టితో పంటలు పండక మెట్టపొలాల్లో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం పండ్లతోటల పెంపకానికి ఇస్తున్న సహకారం సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. ఏటా వర్షాలు పడక పంటలు ఎండిపోయి కొందరు, పండిన పంటలు అధిక వర్షాలకు నాశనమై మరికొందరు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పండ్లతోటల పెంపకానికి మూడేళ్లపాటు సాగుకు అవసరమయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తూ చేపట్టిన ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది. ఉపాధి హామీ పథకం అధికారుల సూచనలతో రెండేళ్ల క్రితం జామ పంట మూడెకరాల్లో సాగుచేశా. మొక్కలు పూత దశకు వచ్చాయి. మరో ఏడాదికి పంట కాపుకాసే అవకాశముంది. – మధు, రైతు

జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి



రైతు జీవన ప్రమాణాలు మెరుగుపడతాయనే ఉద్దేశంతో ఉపాధి హామీ పథకం కింద మెట్ట భూముల్లో పండ్లతోటలు సాగు చేసేందుకు సన్నకారు రైతులకు ప్రభుత్వం చేయూతనందిస్తోంది. అర్హులైన రైతులకు పండ్లు, పూల తోటలు సాగు చేసుకునే అవకాశం కల్పిస్తాం. రైతులకు అవగాహన కల్పిస్తూ పండ్లతోటల సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషిచేస్తున్నాం. పండ్లతోటల సాగుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలకు రైతులు ఆకర్షితులై సాగుకు ముందుకొస్తున్నారు. – రమాదేవి, ఏపీఓ, కోడుమూరు

రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాల పంపిణీ



గని పాఠశాలలో రెండో సెమిస్టర్ పుస్తకాలను చూపిస్తున్న విద్యార్థులు



పాణ్యంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు



కోడుమూరు బాలుర హైస్కూల్లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం తైమూర్‌బాషా

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని మండల విద్యాధికారి విమలా వసుంధర దేవి తెలిపారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలంలోని 38 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 3,743 విద్యార్థులకు 10894 పుస్తకాలు ఒక్క రోజే విద్యార్థులందరికీ అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల తెరిచిన రోజునే మొదటి సెమిస్టర్ పుస్తకాల అందించగా, ఇప్పుడు రెండో సెమిస్టర్ ప్రారంభానికి ముందుగానే ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచిందన్నారు.

పాణ్యంలో 4,892 మందికి..

పాణ్యం: మండల పరిధిలోని కొలుదు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అధికారులు సెమిస్టర్-2పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, ఎంఈఓ కోటయ్య, మండల సచివాలయాల కన్వీనర్లు గుద్దెటి సుమంత్‌రెడ్డి, బలపనూరు పశువైద్యాధికారి చిన్న పుల్లయ్యలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మండలానికి పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. సెమిస్టర్-2 కింద 8,848 పాఠ్యపుస్తకాలు రాగా 4892 మంది విద్యార్థులకు అందించినట్లు చెప్పారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు జడ్పీ హై స్కూల్‌లో శనివారం పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం ప్రాణేష్‌కుమార్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ జరిగింది. ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ ఏడాది కొత్తగా సెమిస్టర్ పద్ధతిని అమలు చేసినట్లు తెలిపారు. ఈ విధానం వల్ల విద్యార్థులకు సిలబస్‌పై ఒత్తిడి తగ్గి, చదువుపై శ్రద్ధ పెరుగుతుందని చెప్పారు.

కోడుమూరు రూరల్: కోడుమూరులోని బాలుర హైస్కూల్ విద్యార్థులకు శనివారం సెమిస్టర్-2 పుస్తకాలను పంపిణీ చేసినట్లు హెచ్ఎం తైమూర్‌బాషా తెలిపారు. హైస్కూల్లో చదువుతున్న 3 నుంచి 5వతరగతి విద్యార్థులకు ఈవీఎస్, వర్క్ పుస్తకాలు, గణిత పాఠ్యపుస్తకాలను, 6 నుంచి 9వ తరగతి విద్యర్థులకు లెక్కలు, ఫిజికల్, బయాలజీ, జనరల్ సైన్స్, సోషల్ సెమిస్టర్-2 పుస్తకాలను వెయ్యి మందికి అందజేసినట్లు వెల్లడించారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

కోడుమూరు రూరల్: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందిస్తున్నట్లు కోడుమూరు తహసీల్దార్ జయన్న అన్నారు. కోడుమూరు పట్టణంలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఓటరు జాబితా సవరణలపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శనివారం తహసీల్దార్ పరిశీలించి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు తన పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి జాబితాలో ఉన్న ఓటర్లు ఇంట్లో ఉన్నారా లేదా అని అడిగి తెలుసుకోవాలన్నారు. ఎవరైనా చనిపోయి ఉన్నా, డబుల్ ఎంట్రీ అయి ఉన్నా వారి ఓట్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. అలాగే 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే పరిష్కరించాలని తహసీల్దార్ ఆదేశించారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు బీఎల్ఓలను ఆదేశించారు. శనివారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో ఓటరు జాబితా నమోదును ఆకస్మికంగా తనిఖీ చేసి బీఎల్ఓలకు పలు సూచనలు, సలహాలిచ్చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి బీఎల్ఓ తమ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన జాబితాను నిశితంగా పరిశీలించాలన్నారు.



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ జయన్న

కల్లూరు: ఓటర్ల జాబితా సర్వేను ఇంటింటికీ వెళ్లి పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ రమేష్ బాబు బీఎల్ఓలకు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మృతులు ఉంటే వారి పేర్లను తొలగించాలన్నారు.

టిప్పర్లతో పాఠశాల మైదానం ధ్వంసం

పాణ్యం : రాయల్టీ, మైనింగ్, విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన టిప్పర్లు పాణ్యం ప్రభుత్వ పాఠశాలలో నిలుపుతుండటంతో పాఠశాల మైదానం ధ్వంసమవుతోంది. టిప్పర్లకు జరిమానా విధించే సమయంలో రెండు మూడు రోజులు ఆలస్యమవుతుండటంతో అవి అక్కడే ఉంటున్నాయి. దీంతో విద్యార్థులకు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాయల్టీ అధికారులు ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. భారీ లోడ్‌తో ఉన్న టిప్పర్లను పాఠశాల మైదానంలో నిలిపారు. దీనికి తోడు వర్షం కురుస్తుండడంతో టిప్పర్ల రాకపోకలతో మైదానంలో భారీగా గుంతలు పడ్డాయి. విద్యార్థులతో పాటు, ఉదయం పూట వాకింగ్‌కు వచ్చే వాకర్స్ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు వాహనాలను పాఠశాల మైదానంలోకి రాకుండా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కోరుతున్నారు.

చెంతకే ప్రభుత్వ సేవలు

- జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పిలుపు
- పడిదెంపాడు, నందనపల్లెలో సురక్షకు విశేష స్పందన



లబ్ధిదారురాలికి కుల ధ్రువీకరణ పత్ర అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): వివిధ రకాల సేవలను ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి ఉచితంగా అందజేస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం మధ్యాహ్నం కర్నూలు మండలం పడిదెంపాడు, నందనపల్లె గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడమే గాక అక్కడికక్కడే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కుల,ఆదాయ సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు కాళ్లు అరిగేలా తిరిగే దుస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సచివాలయాల్లోనే వాటిని అందజేస్తున్నారన్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ఉచితంగా అందజేస్తున్నామని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. 2013లో నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే గూడూరు నుంచి సుంకేసుల వరకు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చి పట్టించుకోలేదన్నారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.6.50 కోట్ల వ్యయంతో రోడ్డును నిర్మించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండూరు మాధురి, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైఎస్ ఎంపీపీ2 నెహ మ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ, సురేష్, మాజీ సర్పంచ్ ఏసేపు, కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్‌డీ నాగేశ్వర్ రెడ్డి, పీఎస్ కవిత, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షను సద్వినియోగం చేసుకోండి

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శనివారం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జయన్న జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించి 904మందికి 11రకాల సర్టిఫికెట్లతో పాటు కౌలు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ అజయ్ భాస్కర్, స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులు అద్దుగల రాజశేఖర్ రెడ్డి, లాయర్ ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, మధు మోహన్‌రెడ్డి, సోమశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం



కౌలు కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- జగనన్న సురక్షలో ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం లొద్దిపల్లె, ఓర్వకల్లు గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నపాటి కారణాలతో పథకాలు అందని అర్హులకు మేలు చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కులం, ఆదాయం, వివాహం, జనన మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు, కౌలు కార్డులు తదితర ఇతర సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రజల కోసం పనిచేసే తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు.ఆ పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పొదుపు మహిళలు రుణాలు మాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. అనంతరం లొద్దిపల్లెలో-1482, ఓర్వకల్లులో-3383 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాదొరెడ్డి, సర్పంచులు పుష్పమ్మ, గంగాధర్ రెడ్డి, తోట అనూష, సచివాలయ మండల కన్వీనర్ లోటర్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు నాగ శిరీష, షాకీరున్నీషా, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, మద్దిలేటి, సచివాలయ కన్వీనర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొలుదులో జగనన్న సురక్ష

పాణ్యం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. శనివారం కొలుదు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గుద్దెటి సుమంత్‌రెడ్డి, ఎంఈఓ కోటయ్య, హౌసింగ్ ఏఈ బాషా , పశుసంవర్ధకశాఖ అధికారి చిన్న పుల్లయ్య, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రభుత్వ పథకాల ఎంపికకు అర్హతే ప్రామాణికంగా తీసుకున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఉలిందకొండ గ్రామంలో నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి, రమణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాలను సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా? అని ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఆరా తీశారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో వివిధ పథకాలు అందిస్తూ పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనకు ఈ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ జనరంజక పాలనకు గల తేడాను గమనించాలన్నారు. టీడీపీ పాలనలో అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు ఉండాలన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనలో అర్హతే కొలమానం అన్నారు. మంచి చేసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారును వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసేపోగు సుంకులమ్మ, ఎంపీటీసీ అనురాధ, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కోడుమూరులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద రూ.24వేలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం సాయంత్రం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చేనేత కార్మికులు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు లాయర్ ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రతి ఏడాది వైఎస్సార్ నేతన్న నేస్తం కింద రూ.24వేలు మంజూరు చేస్తున్నారన్నారు. చేనేత కార్మికులంతా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు గోవిందు, ఏకాంబరం, ప్రభాకర్, శ్రీనివాసులు, సురేష్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



పుసులూరులో కొలువుదీరిన మౌలాలి స్వామి

కల్లూరు: మొహరం నెల ప్రారంభమవడంతో మండలంలో పుసులూరు, తడకనపల్లె, బస్తిపాడు, ఉలిందకొండ వివిధ గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. పుసులూరు గ్రామంలో వెలసిన మౌలాలి స్వామి సరిగెత్తు ఈ నెల 26 (బుధవారం రాత్రి)న జరుగుతుంది.

గూడూరు రూరల్ : మండల పరిధిలోని కె.నాగలాపురం, బూడిదపాడు, పెంచికలపాడు గ్రామాల్లో మొహర్రం పండగను ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ సోమ్లానాయక్ సూచించారు. కె.నాగలాపురంలోని పోలీసుస్టేషన్‌లో గ్రామ పెద్దలతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జరిగే మొహర్రం వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మత పెద్దలు, గ్రామ పెద్దలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ నెల 29న జరిగే వేడుకలను ప్రతి ఒక్కరు ఐక్యమత్యంతో శాంతి యుతంగా జరుపుకోవాలని కోరారు.

రైతులకు కొనుగోలు బిల్లులు ఇవ్వాలి

గడివేముల: దుకాణాల్లో విత్తనాలు, రసాయన మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని లేకపోతే చర్యలు తప్పవని ఏఓ హేమసుందర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రం మన గ్రోమోర్, వివిధ మందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని మందులు, విత్తనాలను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే ఉపేక్షించమన్నారు. దుకాణాల్లో అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



స్టాంటన్‌పురంలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం 38వ వార్డు స్టాంటన్‌పురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించి అందుకు సంబంధించిన బుక్‌లెట్ అందజేశారు. అలాగే సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు పేదలకు అందేవి కావన్నారు. జన్మభూమి కమిటీ నాయకులు సిఫారసు చేసిన వారికే పథకాలు అందేవి అన్నారు. తమ ప్రభుత్వంలో కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. ఇందుకోసం తమ ముఖ్యమంత్రి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ అధినేత చంద్రబాబు, దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ జగన్ సర్కారుపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మరన్నారు. ఆ ఇద్దరు నాయకులు ప్రజలకు చేసిన మేలు శూన్యమన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా అర్హుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాలని ప్రజలను కోరారు. అనంతరం ఏబీఎం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే పాల్గొని పాస్టర్ల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్పొరేటర్ గిప్సన్, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.